# కోరిక

– కోకాసాయి

తన అభిరుచికి అనుగుణంగా కట్టించుకున్న కొత్త ఇంటిని భార్యకు, పిల్లలిద్దరికీ, తండ్రికి చూపించాడు రవి. గృహప్రవేశం బాగా జరిగింది. కొత్త ఇంట్లోకి మకాం మార్చారు.

అక్క వాళ్ల వూరునుంచి తండ్రి ఆరోజే వచ్చాడు. కొత్త ఇల్లు, కొత్త వాతావరణం ఆయనకి బాగా నచ్చాయి. ఓ గది దగ్గర ఆగి ''నాన్నగారూ! ఇది మీగది'' అంటూ తలుపులు తెరిచాడు రవి.

ఆ గదిని పరికిస్తున్న మూర్తిగారి మది పులకించిపోయింది. ఎదురుగా బుక్‌రేక్స్‌లో పాతిక పైచిలుకు పురాణ, సంగీత కళాశాస్త్ర గ్రంథాలు, ఎందరో ఉద్దండుల సంగీత స్వరాలు ఇముడ్చుకున్న ఆడియో కేసెట్లు ఆయన్ని బాగా ఆకట్టుకున్నాయి.

రూమంతా తీర్చిదిద్దినట్టుంది. గోడకి వేలాడుతూ ఓవైపు బాపూజీ ఫోటో, ఆ పక్కగా ఏడుకొండలవాడి దివ్యస్వరూపం, మరోవైపు తనని ఒంటరిని చేసి వెళ్లిన అర్ధాంగి ఫోటో...

''నాన్నగారూ! మీరు హాయిగా శేషజీవితాన్ని నిశ్చింతగా, ప్రశాంతంగా గడపొచ్చు. మీకేం కావలసినా మీ కోడల్ని అడగండి, నేను ఆఫీసుకి వెళ్లొస్తాను'' చెప్పాడు రవి.

ఇంటింటికి బట్టలు మోసుకువెళ్లి అమ్మేవాడు మూర్తి. కొడుకు రవికి, కూతురు సుగుణకి పెళ్లిళ్లు చేసి బాధ్యతలు తీర్చుకున్నాడు. మనవలు పుట్టిన తర్వాత భార్య కాలం చేసింది. కొడుకుకి బ్యాంకులో ఉద్యోగం. అరమరికలు లేని చక్కని సంసారం వాళ్లది. కొడుకు తన అభిరుచుల్ని దృష్టిలో పెట్టుకుని చేసిన ఏర్పాట్లకి మూర్తి ఆనందానికి అవధుల్లేవు. అసంకల్పితంగా భార్య ఫోటోని సమీపించాడాయన. 'లక్ష్మీ.. ఈ లోకం నుంచి ఎవరు ముందు వెళ్తే వాళ్లు అదృష్టవంతులనుకున్నాను కాని, ఇప్పుడు నువ్వు నిజంగా దురదృష్టవంతురాలివే! ఈకాలం కొడుకులు కన్నవాళ్లని చూస్తారా అంటూ మాటవరసకి నువ్వు అనేదానివి. కాని మనల్ని అమితంగా ప్రేమించే కొడుకుని కన్న మనం నిజంగా అదృష్టవంతులం' మనసుకందని భావాలు ఆయన్ని కదిలించాయి. వెల్లువలా పొంగిన ఆనందభాష్పాల్ని భుజం మీది కండువాతో అద్దుకుని, గడచిన జీవితాన్ని తలుచుకుంటూ వాలుకుర్చీలో నడుం వాల్చాడు మూర్తి.

• • •

కొద్దినెలలు గడిచాయి. పొరుగూరులో వున్న కూతురు సరళ పండక్కి వస్తుందేమోనని ఎదురుచూశాడు మూర్తి. ఆమె రాలేదు. కూతుర్ని చూడాలని వుంది. ఆ విషయం కొడుకుతో చెబితే, ''ఈ వయసులో మీరు మాటిమాటికీ ప్రయాణాలు పెట్టుకోవడం అంత మంచిదికాదు. ఇప్పుడు రాకపోయినా, తర్వాత పండక్కయినా అక్కాబావా వస్తారు. మీ కోరికా తీరుతుంది'' అంటూ తండ్రి వెళ్లడానికి అవకాశం లేకుండా చేశాడు రవి.

కాని కొడుకు మాటలు మూర్తికి రుచించలేదు. కూతురు వచ్చేవరకూ ఆయనకి ఆగాలని లేదు. ఈలోగా ఎలాగైనాసరే ఓసారి కూతుర్ని చూడాలని వుంది.

వయసు పైబడినవాళ్లు కూడా ఒకోసారి చిన్నపిల్లల్లాగే ప్రవర్తిస్తుంటారనే మాటను మూర్తిగారు నిజం చేశారు. ఓరోజు చెప్పాపెట్టకుండా సడెన్‌గా ఇంట్లోంచి వెళ్లిపోయారు. ఎక్కడికెళ్లారో తెలియక కొడుకు, కోడలు తెగ హైరానా పడిపోయారు.

రవి బంధుమిత్రులందరికీ ఫోన్లు చేస్తే, చివరికి తన తండ్రి అక్క ఇంట్లో వున్నారని తెలిసింది. ఆరోజే వూరికి ప్రయాణమయ్యాడు రవి.

• • •

''తమ్ముడూ... నాన్నగారు గుడికెళ్లారు. మరో గంటలో వస్తారు. చెప్పకుండా వచ్చినందుకు ఆయన్ని నువ్వేమీ కోప్పడకు. మీ దంపతులు నాన్నగారికి ఏ లోటూ చెయ్యలేదు. నాన్న మిమ్మల్ని తల్చుకోని క్షణం లేదు. ఎప్పుడూ మీమాటే. మీరెంతో బాగా చూశారని నిన్ను, కుమారిని పొగుడుతూ వుంటారు'' చెప్పింది సుగుణ.

''మరి, కనీసం నాకు మాటమాత్రమైనా చెప్పకుండా ఎందుకిలా వచ్చేసినట్టు?'' అడిగాడు రవి.

''అదే చెబుతున్నాను... నాన్నగారికి నన్ను చూడాలని వుందట. నీకు చెబితే వెళ్లవద్దన్నావట.



అందుకే నీకు చెప్పకుండా వచ్చేశారు'' అంటూ నవ్వింది సుగుణ. ''తప్పుగా అర్థం చేసుకోకురా... వృద్ధాప్యంలో వున్నవాళ్లు పిల్లలతో సమానం. నాన్నగార్ని కూడా మనం అలాగే అనుకోవాలి.''

అక్క మాటలకు ఆశ్చర్యంగా చూశాడు రవి. అదే సమయంలో గుడి నుంచి వచ్చిన మూర్తి కొడుకుని చూసి తొట్రుపడ్డాడు. ఆయన మాట తడబడింది. ''ఏ..ఏరా.. ఎప్పుడొచ్చావ్! అమ్మాయి, మనవలు బావున్నారా?'' అంటూ కుశల ప్రశ్నలు వేశాడు.

''ఆ .. అంతా బావున్నారు. మీరు నాకు చెప్పకుండా ఇలా రావడమే ఏమీ బాగోలేదు. మేమెంత కంగారుపడ్డామో తెలుసా నాన్నా..''

కొడుకు చేతుల్ని ఆప్యాయంగా స్పృశించారాయన. ''తప్పుగా అనుకోకురా బాబూ... మీ అక్కని చూడాలనిపించిందిరా. నువ్వేమో వద్దన్నావు. అందుకే చెప్పకుండా వచ్చేశాను.''

''సరే సరే.. ఇంటికి ఎప్పుడొస్తున్నారు?''

''నిన్ననే కదరా వచ్చింది... ఓ నెలరోజులుండి వస్తాను.''

ఆ మర్నాడు రవి ప్రయాణమవుతుంటే కొడుకుతో చెప్పాడు మూర్తి. ''నా చివరి రోజులు నీదగ్గరే గడపాలని వుందిరా... ఈలోగా ఓపికున్నంతవరకూ నాకీ ప్రయాణాలు తప్పవు. మీ అక్కని చూడాలనిపించినప్పుడు మాత్రం నువ్వు నన్ను అభ్యంతరపెట్టకు. ఆ తర్వాత ఎలాగూ ఈ ప్రయాణాలు చెయ్యలేను'' తండ్రి మాటలకు కదిలిపోయాడు రవి.

''అలాగే నాన్నా... మీ ఇష్టప్రకారమే చెయ్యండి. కాని మరోసారి మాత్రం నాకు చెప్పకుండా వెళ్లకండి. నేనే మిమ్మల్ని దగ్గరుండి అక్క దగ్గరకి తీసుకొస్తాను'' అంటున్న కొడుకు వైపు ప్రేమగా చూస్తున్న మూర్తి కళ్లల్లో నీళ్లు నిండుకున్నాయి.

★